క్లుప్తంగా

ట్యాక్సీ డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విఠల్‌గౌడ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ట్యాక్సీ డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దొర విఠల్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. శుక్రవా రం అధ్యక్ష బాధ్యతలను స్వీకరించారు. బస్టాండ్ స మీపంలో గల అసోసియేషన్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాక్సీ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వేసవిలో విద్యార్థులు బయట తిరగవద్దని, వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్, ప్రధానోపాధ్యాయుడు అశోక్ రావ్ పాల్గొన్నారు.

తాత్కాలికంగా శనగ కొనుగోళ్లు బంద్

నేరడిగొండ: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా ఈనెల 22 నుంచి 24 వరకు శనగ కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తుననట్లు సెంటర్ ఇన్‌చార్జి నాగభూషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి షెడ్యూల్ ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కొనసాగుతున్న శనగ కొనుగోళ్లను 24 వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 25న కొనుగోళ్లు జరుగుతాయన్నారు.

మాజీ మంత్రిని కలిసిన మౌనిశ్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: మాజీ మంత్రి పడాల భూమన్నను సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డి కలిశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. పలు విషయాలపై చర్చించారు. సురేందర్ రెడ్డి, దినేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో గల కుమురం భీం కాలనీలో నివసిస్తున్న ఆదివాసీలకు గృహజ్యోతి పథకం కింద విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరుతూ శనివారం చేపట్టనున్న కలెక్టర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కుమురం భీం కాలనీ నిర్వహణ కమిటీ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత రాజకీయాల్లో రాణించాలని జిల్లా ఎన్‌వైకే అధికారి సునీల్ బడ్ అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని నలంద కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వన్ నేషన వన్ ఎలక్షన్, వికసిత్ భారత్‌పై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి విద్యార్థులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన పది మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పున్నారావు, వైస్ ప్రిన్సిపాల్ విజయ్ గోపాల్, రిటైర్డు అధ్యాపకులు విజయ్ బాబు పాల్గొన్నారు.

వాహనదారులు బాధ్యతగా ఉండాలి

గుడిహత్నూర్: వాహనదారులు బాధ్యతగా ఉండాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఉట్నూర్ ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఆకస్మింగా తనిఖీ చేసి వాహనదారులను ఉద్దేశించి మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనదారులు బాధ్యతగా ఉంటే అందరూ క్షేమంగా ఉంటారని పేర్కొన్నారు.

నేడు యువజన ఉత్సవ పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శనివారం యువజన ఉత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల వయస్సు గల వారు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సైన్స్ ఎగ్జిబిషన్, పెయింటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ, కవిత రచన, ఉపన్యాస పోటీలు, సాంస్కృతిక నృత్య విభాగం తదితర అంశాలకు సంబంధించి పోటీలు జరుగుతాయని తెలిపారు.

ప్రారంభమైన 'పది' పరీక్షలు



తలమడుగు: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

తలమడుగు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 217 విద్యార్థులు, బరంపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 148 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో వెంకట్‌రావు తెలిపారు. ఎస్సై అంజమ్మ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో శుక్రవారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తాంసి పరీక్ష కేంద్రంలో 159 మంది విద్యార్థులకు 157 మంది విద్యార్థులు, కప్పర్ల పాఠశాలలో 261 మందికి 261 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. భీంపూర్ అందర్‌బంద్ పరీక్ష కేంద్రంలో 115 మంది విద్యార్థులకు 114 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అందర్‌బంద్ పరీక్ష కేంద్రాన్ని భీంపూర్ తహసీల్దార్ నలంద ప్రియ తనిఖీ చేశారు.

నార్నూర్: నార్నూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలతో పాటు తాడిహత్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదర్శ పాఠశాలలో మొత్తం 191, తాడిహత్నూర్ పాఠశాల్లో 164 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారు. గాదిగూడ మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 132 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలతో ఆశ్రమ బాలికల పాఠశాల, మండలంలోని కేస్లాపూర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో 183 మంది విద్యార్థులకు 183 మంది, ఆశ్రమ బాలికల పాఠశాలలో 190 మంది విద్యార్థులకు 190 మంది, కేస్లాపూర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో 224 మంది విద్యార్థులకు 224 మంది హాజరైనట్లు ఎంఈవో రాథోడ్ మానుకుమార్ తెలిపారు.

నేరడిగొండ: పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మండలంలో 330 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా, ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 170 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 168 మంది రాశారు. లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. మాస్‌కాపీయింగ్ తావులేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంఈవో తెలిపారు.



తాంసి: పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



ఇంద్రవెల్లి: పరీక్ష కేంద్రానికి హాజరైన విద్యార్థులు

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న గజేందర్

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద రూ. 18 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డుకు భూమిపూజ చేశారు. గతంలో ఎప్పుడు లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ సీసీరోడ్లను నిర్మిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాల కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 8 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కళ్లెం నారాయణరెడ్డి, సత్యవతి కోటేశ్వర్, జలైజాకు, బద్దం పోతారెడ్డి, ముస్తాపా పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

బోథ్: బోథ్ పట్టణంలోని నీటి సమస్యను పరిష్కరించాలని బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం ఈవో అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో పలు కాలనీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు పోతన్న, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ గౌడ్, రమాకాంత్, ఉపాధ్యక్షుడు యాసిన్, కట్ట భూమేష్, గొర్ల రాజు యాదవ్ పాల్గొన్నారు.

31లోపు లైవ్ సర్టిఫికెట్ అందించాలి

ఆదిలాబాద్‌టౌన్: విశ్రాంత ఉద్యోగులు ఈనెల 31లోగా లైవ్ సర్టిఫికెట్ అందిచాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, కిష్టయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో దాదాపు 705 మంది రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. లైవ్ సర్టిఫికెట్‌ను వారు సమర్పించలేదని, సర్టి ఫికెట్లు సమర్పించని వారి ఏప్రిల్ నెల పెన్షన్ నిలిచిపోతుందని తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

తాంసి: సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సహకార ఏజెండా అంశాలను సీఈవో కేశవ్ సభ్యుల ముందు చదివి వినిపించారు. వ్యవసాయ రుణాలతో పాటు వ్యవసాయేతర రుణాలను సైతం అందిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణం, వాహనాల కొను గోలుకు సైతం తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎరువులు అందుబాటులో ఉంచేందుకు తాంసి, భీంపూర్‌లో గోదాంల నిర్మాణం చేపడుతున్నామన్నారు. సొసైటీ వైస్ చైర్మన్ ధనుంజయ్, సీఈవో కేశవ్, సభ్యులు సంతోశ్ రెడ్డి, రమేశ్, బుజ్జన్న, చంద్రన్న పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



బోరుబావి నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బంధంరేగ డి, బుర్కపల్లి, పాషాతండా, రాజురా గ్రామాల్లో పర్యటించారు. నీటి సమస్యలపై ఆరా తీసి అక్కడున్న బోరు బావుల ద్వారా నీటిని అందేలా ఏర్పాటు చేశారు. నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఇచ్చోడ: తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండంలోని గాంధీనగర్, బోరిగామ, కామాగిరి గ్రామాల్లో పర్యటించి తాగునీటి ఎద్దడి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి నెలకొనే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామస్తులు ఎవరూ కూడా ఇబ్బంది పడకుండా తాగునీటి సమస్యల పరిష్కస్తామన్నారు. ఆయన వెంట ఎంపీవో సత్యానంద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: హరితహారంలో నాటిన ప్రతీ మొక్కను రక్షించడంతో పాటు అటవీ సంపదను కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎఫ్ఆర్‌వో సంతోష్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శంకగూర్‌గూడ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఎఫ్ఆర్‌వోలు చంద్రరెడ్డి, రాజేందర్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని హరిత వనం పార్కులో ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలను శుక్రవారం అటవీశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా హరిత వనం పార్కులో చెత్తను ఏరివేశారు. ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లు చాలా అవసరమన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్వో ప్రమోద్ కుమార్, అటవీ శాఖ ఉద్యోగులు గులాబ్, అహ్మద్ ఖాన్, మోహవత్‌రావ్, ధన్‌సింగ్ పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్ ప్రభుత్వ సైన్సెస్ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సంగీత ప్రకటనలో తెలిపారు. 30 ఏళ్లలోపు వయస్సు కలిగి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎస్పీకి బర్డ్ ఫీడర్ అందజేత

బోథ్: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను బోథ్ గ్రామానికి చెందిన పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేష్ శుక్రవారం మర్యాద పూరకంగా కలిశారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ఎస్పీకి బర్డ్ ఫీడర్‌ను అందజేశారు.

రుణాలను రెన్యూవల్ చేసుకోండి

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు వడ్డీ చెల్లించి, రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో గోలి స్వామి శుక్రవారం తెలిపారు. ఈ నెల 31లోపు చెల్లించాలన్నారు. ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ శైలజ రైతులను కలిసి రుణాలపై అవగాహన కల్పించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గుడిహత్నూర్: బీసీ బిల్లు ప్రవేశపెట్టి బీసీలకు న్యాయం చేశారంటూ స్థానిక కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా, నాగ్‌నాథ్ అప్పా, రవీందర్, బాలాజీ సోంటక్కే, కరాడ్ బ్రహ్మనంద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

బోథ్: బోథ్ మండలంలోని లంబాడితండా గ్రామాన్ని బాబెరతండా గ్రామంగా మార్చినందుకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను నేరడిగొండలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. గ్రామపెద్దలు మాజీ సర్పంచ్ కాశీనాథ్, జేత్రామ్, రూపచంద్ జాదవ్, ఆత్మ రామ్, నాయక్, గులాబ్ నాయక్ పాల్గొన్నారు.

ఎస్పీకి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో యాక్టివ్ కన్జ్యూమర్ ఫోరం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తలమడుగు: మండలంలోని ఝరీ, చెర్లపల్లి గ్రామాల్లో రూ. 6 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం భూమిపూజ చేశారు. మండల కన్వీనర్ వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, జనక్, రమాకాంత్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తొలి రోజు జరిగిన బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ అతీక్ బేగం, వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కోటయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నాయబ్ తహసీల్దార్ విజయ్‌కాంత్‌రావు, ఆర్ఐలు యజువేందర్ రెడ్డి, అలీమ్ పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాధికారి కంటె నర్సయ్య శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు తరగతి గదిలో జరుపుతున్న బోధనాభ్యసన ప్రక్రియను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు లింగన్న, సీఆర్‌పీ విజయ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న గంగారెడ్డి

బోథ్: గత కొన్ని రోజులుగా సొనాల మండల కేంద్రంలో కొనసాగుతున్న సొనాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్‌లో థండర్స్ టైటాన్స్, రాయల్ స్ట్రైకర్స్ జట్లు తలపడగా, థండర్స్ టైటాన్స్ జట్టు విజయం సాధించింది. థండర్స్ టైటాన్స్ జట్టుకు బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి రూ. 21 వేల నగదును, రన్నరప్‌గా నిలిచిన రాయల్ స్ట్రైకర్స్ జట్టుకు రూ. 15 వేలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేష్, పసుల చంటి, గాజుల పోతన్న, ప్రతాప్, విజయ్, బోరె రవీందర్ పాల్గొన్నారు.

అద్దె ఇళ్లలోనే ఉంటున్నారా?

- అర్హుల గుర్తింపునకు క్షేత్రస్థాయి సర్వే



వివరాలు సేకరిస్తున్న హౌజింగ్ అధికారులు

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధికోసం పేద ప్రజలు దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో తమకు సొంత ఇళ్లు లేనట్లుగా సుమారు 1200 మంది ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తులను అందజేశారు. అందులో నిజమైన అర్హుల గుర్తింపుపై జిల్లా హౌజింగ్ శాఖ అధికారులు దృష్టి సారించారు. డీఈ ఆర్.శంకర్, ఏఈ నసీర్‌లు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. వాస్తవంగా వారు అద్దె ఇళ్లలో ఉంటున్నారా? లేక సొంత ఇల్లు ఉందా? అనే దానిపై వారి వివరాలను సేకరిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని 45, 48, 46వ వార్డుల్లో సర్వే నిర్వహించారు. దరఖాస్తుదారుల ఇంటింటికి వెళ్లి వారి సమాచారాన్ని సేకరించారు.

ఎట్టకేలకు శనగ కొనుగోళ్లు షురూ



కొనుగోళ్లను పరిశీలిస్తున్న గోవర్ధన్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మార్కెట్ యార్డులో ఎట్టకేలకు శనగ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మార్కెట్ యార్డులో హమాలీలు, గుత్తేదారుల మధ్య నెలకొన్న వివాదంతో మూడు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు శుక్రవారం కొనుగోళ్లు నిర్వహించారు. సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్ అరుణ జైనథ్ మార్కెట్ యార్డుకు వెళ్లి కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.

'పది' పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్



వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: పది పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకొని పరీక్షలు రాశారు. 871 విద్యార్థులకు 868 మంది విద్యార్థులు హాజరయ్యారు., పరీక్ష కేంద్రాలు ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ



మందకృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రణదీవేనగర్‌లో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు జరుపుకున్నారు. అనంతరం జెండా ఆవిష్కరణ చేసి, మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఉద్యమంలో జాతి కోసం అసువులు బాసిన అమరవీరులకు వర్గీకరణకు అంకితమిస్తున్నారు. అంతిమంగా రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుకెళ్తామని పేర్కొన్నారు. నాయకులు పుల్లూరి రాజన్న, గడచంద మోహన్, ఆరేపల్లి గణేష్, మడిపల్లి మనోజ్, శంకర్, జువ్వక చిన్నయ్య, రమేశ్, కిష్టన్న, అశోక్, పొచ్చన్న, ఉమేష్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నేతలు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆడె గజేందర్

బోథ్: మండల కేంద్రంలోని జామా మసీదులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. ఈద్గాలో సీసీ కోసం రూ. 10 లక్షల ప్రొసిడింగ్స్ జామ మస్జిద్ అధ్యక్షులు మౌలానా అఖిల్‌కు అందించారు. కార్యక్రమంలో నాయకులు మౌలానా అఖిల్, మౌలానా అర్షద్, భోడ్డు గంగారెడ్డి, పసుల చంటి, గొర్ల రాజు యాదవ్, చట్ల ఉమేష్, మహమ్మద్, రహీముద్దీన్, అబ్రార్, షాకీర్,షేక్ నాజర్ అహ్మద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు



దీక్ష శిబిరంలో కూర్చున్న మహిళలు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని సిమెంట్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారంతో మూడో రోజుకు చేరిన దీక్షల్లో వివిధ పార్టీలకు చెందిన మహిళలు కూర్చున్నారు. కేంద్రం స్పందించే వరకు ఆందోళన చేస్తామని సాధన కమిటీ కో కన్వీనర్ విజ్జ గిరి నారాయణ హెచ్చరించారు.